సాక్షి
మంచిర్యాల

గురువారం, 11, మే, 2023



వేసవి సీజన్.. ఆదాయ మార్గం

మామిడి కోత పనుల్లో విద్యార్థులు భాగస్వామ్యం అవుతున్నారు. విద్య అవసరాల కోసం రోజు కూలీగా పని చేస్తున్నారు. రోజుకు రూ.400 నుంచి రూ.600 సంపాదిస్తున్నారు. 8లో▸



ప్రతి పౌరునికి రాజ్యాంగం అందించాలి

చెన్నూర్/కోటపల్లి: రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగాన్ని ఉచితంగా పంపిణీ చేయాలని కోరుతూ బుధవారం ధర్మ సమాజ్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో చెన్నూర్ తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండేకు, కోటపల్లి తహసీల్దార్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
41.0 /28.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఎండల తీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

హరితను అభినందించిన మంత్రి



హరితను అభినందిస్తున్న మంత్రి గంగుల

మందమర్రిరూరల్: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో 468/470 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన శ్రీరాముల హరితను హైదరాబాద్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, ఎంజేపీ విద్యాసంస్థల కార్యదర్శి మల్లయ్య భట్టు శాలువా కప్పి సన్మానించారు. రూ.10వేల నగదు అందజేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య అందుతుందని, చదువులో రాణిస్తేనే విద్యార్థుల భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని తెలిపినట్లు ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజుల తెలిపారు. హరిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్యాంసుందర్‌రావు



శ్యాంసుందర్‌రావును సన్మానిస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మంచిర్యాలకు చెందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వరంగల్‌లో జరిగిన రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కనపర్తి రమేశ్, కోశాధికారి రమేశ్‌రెడ్డి, పీడీ గడిగొప్పుల సదానందం సన్మానం చేశారు.

అర్హులకు ఇళ్లపట్టాలు



ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: అర్హత కలిగిన ప్రతీ ఇంటికి పట్టాలు ఇప్పించి యాజమాన్యపు హక్కును కల్పిస్తామని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 15, 33వ వార్డుల్లో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి నుంచి ఇళ్ల పట్టాలు లేకుండా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇళ్ల పట్టాల సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి అసెంబ్లీలో ప్రస్తావించినట్లు తెలిపారు. ప్రజల కోసం దీర్ఘకాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న ఇళ్ల పట్టాల సమస్యను తీర్చానని అన్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో దాదాపు 10 వేల మందికి ఇళ్లపట్టాలు ఇస్తున్నట్లు తెలిపారు. దళారుల మాటలు నమ్మకుండా ఎవరికీ నయాపైసా చెల్లించకుండా పట్టా తీసుకోవాలని కోరారు. ఎవరైనా డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఆయా వార్డుల్లో కంటి వెలుగు వైద్య శిబిరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, మున్సిపల్ కౌన్సిలర్ ఉమాదేవి, బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి రేవెల్లి విజయ్ పాల్గొన్నారు.

13న ఓపెన్ ఇంటర్ ఎకనామిక్స్ పరీక్ష

మంచిర్యాలఅర్బన్: ఈ నెల 13 ఓపెన్ ఇంటర్ ఎకనామిక్స్ తెలుగు మీడియం పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2న తెలుగు మీడియంకు బదులుగా ఇంగ్లిష్ మీడియం పేపర్ రావడంతో పరీక్ష వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు. తిరిగి 13న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గతంలో రాసిన కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో తెలిపారు.

దొంగలు బాబోయ్



జిల్లా కేంద్రంలోని ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో దొంగతనానికి పాల్పడివారు ఉపయోగించిన కారు

- జిల్లాలో వరుస చోరీలతో భయాందోళన
- తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు

మంచిర్యాలక్రైం: జిల్లాలో దొంగలు వరుస దొంగతనాలతో హల్‌చల్ చేస్తున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల జిల్లా కేంద్రం మంచిర్యాలలో ఒకే అపార్టుమెంటులో మూడు చోరీలు, సీసీసీ నస్పూర్‌లో పట్టపగలే దొంగతనానికి పాల్పడి పోలీసులకు సవాల్ విసిరారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తాళం వేసి ఒక్క రోజు ఎక్కడికైనా వెళ్తే చాలు వచ్చేసరికి ఇల్లు దోచేస్తున్నారు. దొంగలు రోజంతా రెక్కీ నిర్వహించి తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. దొంగతనం జరిగిన తర్వాత పోలీసులు హడావుడి చేయడం పరిపాటిగా మారింది. పోలీసుల గస్తీని ముమ్మరం చేయడం జిల్లా పోలీసు యంత్రాంగం విఫలమైందనే ఆరోపణలున్నాయి. సులువుగా డబ్బు సంపాదించాలని, జల్సాలకు అలవాటు పడి కొందరు యువత నేర ప్రవృత్తిలోకి దిగుతున్నారు. బెట్టింగ్, జూదం, ఆన్‌లైన్‌గేమింగ్, మద్యం, గంజాయి, గుట్కా వంటి వాటికి బానిసలుగా మారి నేరాల బాట పడుతున్నారు. ఇటువంటి వారే పోలీసులకు సవాల్‌గా మారారు.

తెలిసిన వ్యక్తుల్లా వచ్చి..

పాత నేరస్తులు చోరీలు చేస్తే పోలీసుల వద్ద గతంలో ఉన్న వేలిముద్రలు, ఇతర ఆధారాల వల్ల సకాలంలో గుర్తించేందుకు వీలు కలిగేది. ఇప్పుడు కొత్తవారు నేరాల బాట పట్టడంతో పోలీసులకు తలనొప్పిగా మారింది. నేరస్తులుగా మారుతున్న వారిలో విద్యార్థులు, మైనర్లు ఉండడం అటు పోలీసులు, ఇటు ప్రజలను కలవర పెడుతోంది. బాగా తెలిసిన వ్యక్తుల్లా వచ్చి రెక్కీ నిర్వహించి దర్జాగా పట్టపగలే అపార్టుమెంట్లలో చొరబడి ప్లాట్లలో దొంగతనం చేస్తున్నారు. ఈ నెల 2న సీసీసీ నస్పూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని శ్రీలక్ష్మి ఎన్‌క్లేవ్స్, జిల్లా కేంద్రంలోని ఆదిత్య ఎన్‌క్లేవ్స్‌లోని కృతిక అపార్టుమెంటులో ఒకే రోజు మూడు ఇళ్లలో పట్టపగలు చోరీ జరిగింది. కర్ణాటక పాసింగ్ ఉన్న కారులో ఇద్దరు వ్యక్తులు వచ్చి నిమిషాల వ్యవధిలో దోచుకెళ్లారు. సీసీసీలో జరిగిన దొంగతనంలో రూ.15లక్షలు నగదు, 21 తులాల బంగారు నగలు, 40 తులాల వెండి చోరీ చేశారు. దొంగలు ఉపయోగించిన కారు, దొంగలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యారు. సంబంధిత పుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

- ఈ నెల 4న మంచిర్యాల ఆదిత్య ఎన్‌క్లేవ్స్‌లో నివాసం ఉంటున్న సింగరేణి కార్మికుడు వినయ్ ఇంట్లో దొంగతనం జరిగింది. ఆరు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి.
- గత నెల 28న జిల్లా కేంద్రంలోని లక్ష్మినగర్‌లో నివాసం ఉంటున్న కనకల రాజనర్సు ఇంట్లో దొంగతనం జరిగింది. 21గ్రాముల బంగారు గొలుసు చోరీకి గురైంది.
- గత నెల 22న తాండూర్ మండల కేంద్రంలోని గోపాల్‌నగర్‌కు చెందిన బీఎస్‌ఎన్ఎల్ ఉద్యోగి చౌదరి ఇంట్లో చొరబడి ఆయన భార్య పద్మజను కత్తితో బెదిరించి ఒంటిపై ఉన్న 10తులాల బంగారు నగలు దోచుకెళ్లారు.
- ఈ నెల 9న బెల్లంపెల్లి హన్మన్‌బస్తీకి చెందిన మడుపు హరీష్ ఇంట్లో జరిగిన దొంగతనంలో రూ.1.50లక్షలు నగదు, మూడు తులాల బంగారు నగలు దొంగతనం చేశారు.

జిల్లాలో దొంగతనాలు

సంవత్సరం	దొంగతనాలు	ఛేదించినవి	చోరీ సొత్తు విలువ	రికవరీ చేసిన సొమ్ము
2022	325	133	రూ.2,39,11,270	రూ.1,06,52,815
ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు			106	
రాత్రివేళ 31	పగలు 15		సాధారణ దొంగతనాలు 60	

టీవీ ఎత్తుకెళ్లిన దొంగలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి బెల్లంపల్లి బస్తీలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. వన్‌టౌన్ ఎస్సై విక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం చెల్పూర్‌కు చెందిన బైరి వనరెడ్డి ఆసిఫా బాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో కంట్రోలర్‌గా పని చేస్తున్నాడు. బెల్లంపల్లిబస్తీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని మూడేళ్ల నుంచి ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. గత కొద్ది రోజులుగా ఆరోగ్యం బాగా లేకపోవడంతో గత నెల 5న ఇంటికి తాళం వేసి వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లాడు. చికిత్స అనంతరం బుధవారం బెల్లంపల్లికి చేరుకున్నాడు. ఇంటికి వెళ్లి చూడగా తాళం పగులగొట్టి కనిపించింది. రూ.13 వేలు విలువైన కలర్ టీవీని దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెట్రోలింగ్ సిబ్బందిని పెంచాం..



జిల్లాలో వరుస దొంగతనాలు చోటు చేసుకోవడంతో పెట్రోలింగ్ సిబ్బందిని పెంచాం. కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని గమనిస్తే స్థానిక పోలీసులకు గానీ, 100డయల్‌కు గానీ సమాచారం అందించాలి. ఊర్లకు వెళ్లే ముందు విలువైన వస్తువులను ఇంట్లో ఉంచి వెళ్లరాదు. పోలీసులకు సమాచారం ఇచ్చినట్లయితే ఆయా ప్రాంతాల్లో నిఘా పటిష్టం చేస్తాం. దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్‌లు ఉన్నా యి. అందరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. పోలీసులకు ప్రజలు సహకరించాలి.

– బీ.తిరుపతిరెడ్డి, ఏసీపీ, మంచిర్యాల

‘పది’పోయిన ఉత్తీర్ణత



బెల్లంపల్లి : సిద్ధార్థ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు, ఉపాధ్యాయులు

- రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 23వ స్థానం
- పరీక్షలు రాసిన విద్యార్థులు 10,076
- ఉతీర్ణులు 8,552
- ఉత్తీర్ణత శాతం 84.87
- బాలికలు 87శాతం
- బాలురు 82.91శాతం

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల జీవితాల్లో కీలకమైన పదో తరగతి పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఫలితాలు నిరాశ కలిగించాయి. పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా 23వ స్థానంలో నిలిచింది. గత ఏడాది మాదిరిగానే రాష్ట్ర స్థాయిలో మళ్లీ అదే అదే స్థానం సాధించినా ఉతీర్ణత శాతం పడిపోయింది. ఈ ఏడాది జనవరిలో బదిలీ, పదోన్నతుల షెడ్యూల్ ప్రక్రియ ప్రారంభించడం, ఉపాధ్యాయుల బదిలీల్లో మునిగితేలడం, బోధన తరగతులపై కొంతమేర ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. 2022–23లో 10,076 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 8,552 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 4,336 మంది బాలురకు గాను 4,819మంది, 4,846 బాలికలకు గాను 4,216 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 84.87శాతం ఉత్తీర్ణులు కాగా.. బాలురు 82.91 శాతం, బాలికలు 87శాతం ఉన్నారు. బాలికలే అధిక సంఖ్యలో ఉత్తీర్ణత శాతంతో ముందు వరుసలో నిలిచారు. గత ఏడాది 90.55శాతం ఫలితాలు సాధించగా ఈ ఏడాది 84.87శాతానికి పడిపోయింది. ఈ ఏడాది(2022–23) ప్రకటించిన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 23వ స్థానంలో నిలిచింది.

నాలుగోసారీ వంద శాతం

- సీఓఈ బాలుర గురుకుల హవా

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థులు నాలుగోసారీ వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈసారి 72మంది విద్యార్థులకు గాను అందరూ ఉతీర్ణులయ్యారు. కొండగొర్ల సిద్ధార్థ 10, నీలాల అభిరామ్, గోమాస యశ్వంత్ 9.8, మరో ఐదుగురు విద్యార్థులు 9.7, 29మంది విద్యార్థులు 9 జీపీఏతో ప్రతిభను చాటుకున్నారు. తొలిసారిగా 2019–20 విద్యాసంవత్సరం పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆ తర్వాత 2020–21, 2021–22, 2022–23 విద్యాసంవత్సరంలోనూ విజయ బావుటా ఎగుర వేస్తూ గురుకుల పాఠశాల ప్రత్యేకతను చాటుకుంటోంది. 10జీపీఏ సాధించిన సిద్ధార్థ్‌తోపాటు తల్లిదండ్రులను ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, ఉపాధ్యాయులు బుధవారం ప్రత్యేక కార్యక్రమంలో పుష్పగుచ్ఛం అందజేసి ప్రశంసించారు. మిఠాయిలు తినిపించారు. వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్క్రైబ్ సాయంతో పరీక్ష రాసి

దండేపల్లి: దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి సాయిని పోచన్న మానసిక వికలాంగుడు. పైగా దృష్టిలోపం ఉండడంతో స్క్రైబ్ విష్ణుతేజ్ సాయంతో పరీక్ష రాశాడు. బుధవారం విడుదలైన ఫలితాల్లో 6.7 జీపీఏతో ఉత్తీర్ణత సాధించాడు.

జిల్లాల విభజన తర్వాత 2015 నుంచి 2022–23 వరకు ఫలితాలు ఇలా ఉన్నాయి

సంవత్సరం	మొత్తం	ఉత్తీర్ణత		ఉత్తీర్ణతశాతం	
		విద్యార్థులు	విద్యార్థులు	బాలురు శాతం	బాలికలు శాతం
2015–16	37330	30698	81.25	831.9	82.23
2016–17	11047	9198	83.00	83.53	83.26
2017–18	10832	9316	84.95	87.05	86.00
2018–19	11045	10398	93.68	94.59	94.14
2019–20	11080	11079	99.98	100	99.99
2020–21	11131	11131	100	100	100
2021–22	10522	9528	88.44	99.82	90.55
2022–23	10071	8552	82.91	87	84.87

శతశాతంలో ప్రభుత్వ బడి వెనుకంజ

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధనలో ప్రభుత్వ పాఠశాలలు వెనుకంజ వేశాయి. గత ఏడాది 22 పాఠశాలలు వంద శాతం సాధించగా ఈ ఏడాది 18కి పడిపోయాయి. 10 జీపీఏ సాధనలోనూ నిరాశపర్చాయి. 79మంది 10జీపీఏలు సాధిస్తే ప్రభుత్వ పాఠశాలల వారు 12 మంది మాత్రమే ఉన్నారు. వంద శాతం ఫలితాలు సాధించిన వాటిలో స్థానిక సంస్థల పాఠశాలలు 6, కేజీబీవీలు 1, టీఎస్ఎంఎస్ 1, టీఎస్ఆర్ఎస్ 1, టీఎంఆర్ఎస్ 2, ఎంజేపీ 3, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ 4 ఉన్నాయి.

- 99 స్థానిక సంస్థల పాఠశాలల్లో 3,349మంది విద్యార్థులకు గాను 2,498 మంది ఉత్తీర్ణత సాధించారు. వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల్లో వేమనపల్లి, కన్నెపల్లి, చంద్రవెల్లి జెడ్పీహెచ్ఎస్‌లు, కొర్విచెల్మ, మామిడిపల్లి, గూడెం పాఠశాలలు ఉన్నాయి. ఒక్కరే 10జీపీఏ పొందారు.
- ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో 222మందికి గాను 134మంది ఉతీర్ణులయ్యారు.
- నాలుగు ఎయిడెడ్ పాఠశాలల్లో 281 మందికి గాను 252మంది పాసయ్యారు.
- 18 కేజీబీవీల్లో భీమిని మాత్రమే వంద శాతం సాధించింది. 619 మందికి గాను 511 మంది ఉత్తీర్ణులయ్యారు.
- ఐదు టీఎస్ఎంఎస్‌లో 91మందికి గాను 436మంది ఉత్తీర్ణత పొందారు. మందమర్రి టీఎస్ఎంఎస్ వంద శాతం ఫలితాలు సాధించింది.
- తొమ్మిది టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌లో 680 మందికి గాను 667 మంది పాసయ్యారు. లక్సెట్టిపేట, బెల్లంపల్లి బాలికల, జైపూర్, బెల్లంపల్లి బాలుర పాఠశాలలు వందశాతం ఫలితాల్లో దూసుకెళ్లాయి. ముగ్గురు విద్యార్థులు 10 జీపీఏ సాధించారు.
- బెల్లంపల్లి టీఎస్ఆర్ఎస్‌లో 74 మందికి గాను అందరూ పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒక్క విద్యార్థి 10జీపీఏ పొందారు.
- 3 టీఎంఆర్ఎస్‌లో 152 మందికి గాను 150మంది పాసయ్యారు. చెన్నూర్ బాలుర, బెల్లంపల్లి బాలికల పాఠశాలలు వందశాతం ఫలితాలు పొందాయి.
- 14 జీఏహెచ్ఎస్‌లో 446 మందిలో 265 మంది ఉత్తీర్ణత పొందారు. ఎంజేపీలో 514 మందికి గాను 500 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో లక్సెట్టిపేట, చెన్నూర్ బాలుర, బెల్లంపల్లి బాలికల పాఠశాలలు శత శాతం ఫలితాలు సాధించగా, ఐదుగురు విద్యార్థులు 10జీపీఏ సాధించారు.

ఏరోనాటికల్ ఇంజనీరింగ్ లక్ష్యం



గాయత్రి

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచిర్యాల ఆదర్శ పాఠశాలకు చెందిన పూసల గాయత్రి 10జీపీఏ సాధించింది. మధ్యతరగతి కుటుంబానికి చెందిన గాయత్రి తండ్రి వృత్తి రీత్యా వడ్రంగి పనిచేసుకుంటూ హమాలీవాడలో నివసిస్తున్నారు. భవిష్యత్తులో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చదవడమే తన లక్ష్యమని గాయత్రి తెలిపింది. పాఠశాల ప్రిన్సిపాల్ రజని విద్యార్థిని గాయత్రిని అభినందించారు.

రాజ్యాంగ పరిరక్షణకు ప్రజా పోరాటాలు



ఐక్యతను చాటుతున్న చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు, కళాకారులు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి
- ముగిసిన ప్రజాపోరు యాత్ర

బెల్లంపల్లి: ఛాయ్‌వాలా పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ నుంచి రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు దేశవ్యాప్తంగా ప్రజాపోరాటాలు సాగిస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో సీపీఐ ప్రజాపోరుయాత్ర బుధవారం ముగిసింది. బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఉన్న 70 లక్షల కోట్ల నల్ల డబ్బును బయటకు తీసి ప్రతీ వ్యక్తి బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ప్రకటించి మోసం చేశారని విమర్శించారు. బీజేపీ అధికారంలో రాకముందు వంట గ్యాస్ ధర రూ.420 ఉండగా ప్రస్తుతం రూ.1200కు చేరిందని తెలిపారు. ప్రజలపై పన్నుల భారాన్ని మోపి దగా చేస్తున్నారని, రాజ్యాంగ సవరణకు కుట్ర పన్నారని విమర్శించారు. రాజ్యాంగాన్నీ కాపాడుకోవాల్సిన బాధ్యత పౌరులందరిపై ఉందన్నారు. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ శక్తులకు అప్పగించడానికి కేంద్రం యత్నాలు చేయడం సరికాదని, సింగరేణి సంస్థకే అప్పగించాలని డిమాండ్ చేశారు. గ్లోబల్ టెండర్లు పిలవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అమరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రాన్ని పాలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు. రాష్ట్రంలో 11 లక్షల ఎకరాల పోడు భూములు ఉండగా సీఎం కేసీఆర్ మూడు లక్షల ఎకరాలకే పట్టాలు ఇస్తామని ప్రకటించడం సరికాదన్నారు. వీఓఏలు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం బెదిరిస్తోందని అన్నారు. బీజేపీని ఓడించేందుకు సీపీఐ మునుగోడు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇచ్చిందే తప్పా ప్రజా సమస్యలపై పోరాటం చేయకూడదని కాదన్నారు. బెల్లంపల్లి ఎన్నికల్లో పోటీ చేయాలని సీపీఐ భావిస్తోందని తెలిపారు. ప్రజానాట్యమండలి కళాకారుల గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, ప్రజా నాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సీపీఐ కుమురంభీమ్ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ, సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, ఎం వెంకటస్వామి, ఎం.రాజేశం, కామెర మల్లయ్య, సాలిగామ సంతోష్, బొంతల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వయోవృద్ధుల పోషణకు వెబ్ పోర్టల్

- కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: నిరాదరణకు గురైన వయోవృద్ధుల పోషణ విషయంలో ఫిర్యాదుకు వెబ్‌సైట్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో వయోవృద్ధుల పోషణ వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోవృద్ధులు, తల్లిదండ్రుల పోషణ సమస్యల పరిష్కారం కోసం ఈ వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు. రాతపూర్వకంగానూ కలెక్టర్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదులను పర్యవేక్షించి సత్వర న్యాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి కే.చిన్నయ్య, సీడీపీవో హేమసత్య, ఎస్ఆర్‌వో, పర్జాన రజిత, శ్యామల, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు మొండయ్య పాల్గొన్నారు.



రైస్‌మిల్లర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

రైస్‌మిల్లులు లక్ష్యాలను పూర్తి చేయాలి

మందమర్రిరూరల్: జిల్లాలోని రైస్‌మిల్లులకు కేటాయించిన వరిధాన్యం లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. బుధవారం మండలంలోని అందుగులపేటలో వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లును జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌తో కలిసి తనిఖీ చేశారు.

క్లుప్తంగా

పీవో సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



పీవోను సన్మానిస్తున్న ఎస్వోటూ జీఎం

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా కైరిగూడ ఓసీపీ ప్రాజెక్టు అధికారిగా సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7 గ్రూప్ ఏజెంట్‌గా పనిచేసిన ఆయనను యాజమాన్యం కైరిగూడ ఓసీపీ ప్రాజెక్టు అధికారిగా బదిలీ చేసింది. ఎస్వోటూ జీఎం కేహెచ్ఎన్ గుప్తా, పీవో ఉమాకాంత్, ఇన్‌చార్జి మేనేజర్ రాజేశ్వర్‌రావు, అదనపు మేనేజర్ మధుసూదన్, డీవైపీఎం నాగుల వేణు, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి కార్నాథం వెంకటేశం ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సింగరేణి ఇసుక క్వారీ తనిఖీ



తనిఖీ చేస్తున్న చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్

చెన్నూర్: పట్టణంలోని గోదావరినదిలో ఉన్న సింగరేణి ఇసుక క్వారీని బుధవారం సింగరేణి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ హనుమంతరావు తనిఖీ చేశారు. క్వారీలో ఇసుక లిఫ్టింగ్ ప్రదేశాలు, సీసీ కెమెరాల పనితీరు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఆస్తుల పరిరక్షణే సెక్యూరిటీ విభాగం లక్ష్యమన్నారు. ప్రతి సెక్యూరిటీ ఆఫీసర్ సింగరేణి ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. కంపెనీ ఆస్తులు కాపాడడంలో సెక్యూరిటీ సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆయన వెంట సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, ఇన్స్‌పెక్టర్ అజీమొద్దీన్ ఉన్నారు.

ఇళ్లస్థలాలు సాధించే వరకూ ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

చెన్నూర్‌రూరల్: ఇళ్లస్థలాలు సాధించే వరకు ఉద్యమిద్దామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. బావురావుపేట గ్రామ శివారులోని అసైన్డ్ భూములను పేదలకు ఇవ్వాలని చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఎండీ అవేజ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె హాజరై మాట్లాడారు. ఇళ్ల స్థలాల కోసం నిరుపేద మహిళలు చేస్తున్న పోరాటం ఆగదన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, దాసరి రాజేశ్వరి, బోడంకి చందు, అవేజ్ పాల్గొన్నారు.

వేసవి సీజన్.. ఆదాయ మార్గం

- మామిడి కోత పనుల్లో విద్యార్థులు
- రోజుకు రూ.400 నుంచి రూ.600 కూలి
- విద్యావసరాల కోసం సంపాదన

సెలవులు వచ్చాయంటే మామూలుగా ఎవరైనా విద్యార్థులు సరదాగా బంధువుల ఇంటికి వెళ్దామా? ఎక్కడికైనా టూర్‌కు వెళ్దామా? ఫ్రెండ్స్‌తో కలిసి సినిమాకు వెళ్దామా? అని ఆలోచిస్తారు. ప్రస్తుతం వేసవికాలంలో మండుతున్న ఎండలకు కొంతమంది ఇంటివద్దే కాలక్షేపం చేస్తారు. మరి కొంతమంది విహార యాత్రల పేరుతో వేసవి సెలవులు ముగించేస్తారు. కానీ జిల్లాలోని పలువురు విద్యార్థులు వేసవి సెలవుల్లో సరదాగా మామిడికోతలకు వెళ్తూ తమ అవసరాలకు డబ్బులు సంపాదించుకుంటున్నారు.



మామిడితోటలో కాయలు కోస్తున్న విద్యార్థులు

ఏటా వెళ్తున్నా ...



ఇలా కష్టపడి పని చేయడం వల్ల భవిష్యత్‌లో ఎలాంటి కష్టాన్నయినా తట్టుకోగలమని అనిపిస్తుంది. తల్లిదండ్రులపై భారం పడకుండా ఉండేందుకు ఏటా వేసవి సెలవుల్లో మామిడి కాయలు కోసే పనికి వెళ్తున్నా. వచ్చిన డబ్బులను విద్యావసరాల కోసం వినియోగిస్తున్నా. – కాట్న శ్రీకాంత్, డిగ్రీ విద్యార్థి, గంగారం

పరీక్షలు ముగియగానే..



ఇటీవలే పదో తరగతి పరీక్షలు రాశా. పరీక్షలు ముగిసిన మరుసటి రోజు నుంచే మామిడి కాయలు కోసే పనికి వెళ్తున్నా. మాది నిరుపేద గిరిజన కుటుంబం. అమ్మానాన్నలపై భారం పడకుండా ఇంటర్ చదువు కోసం డబ్బులు పనికి వస్తాయని స్నేహితులతో కలిసి పనికి వెళ్తున్నా. రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు వస్తున్నాయి. – గోగుల విశాల్, పదోతరగతి విద్యార్థి, చిత్తాపూర్

ఆర్థిక ఇబ్బందులతో...



మాది నిరుపేద గిరిజన కుటుంబం. ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశా. మా తల్లిదండ్రులపై భారం పడకుండా వారికి ఆసరాగా ఉండేందుకు సెలవుల్లో ఈ పనిని ఎంచుకున్నా. మామిడి కాయలు కోసేందుకు వెళ్లగా వచ్చిన డబ్బులతో పుస్తకాలు, బట్టలు, ఫీజులు వంటి అవసరాలు తీర్చుకుంటున్నా. – తొడిసెం సంజయ్, ఇంటర్ విద్యార్థి, కొత్తూర్

నెన్నెల(బెల్లంపల్లి): జిల్లాలో 20 వేల ఎకరాల్లో మామిడితోటలు సాగవుతున్నాయి. వేసవికాలంలో ఏప్రిల్, మే మాసంలోనే మామిడికోతలు ప్రారంభమవుతాయి. ఇదే సమయంలోనే పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటిస్తారు. జిల్లాలో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ వరకు చదివిన పేద, గిరిజన, బలహీన వర్గాలకు చెందిన వెయ్యి మందికి పైగా విద్యార్థులు వేసవి సెలవుల్లో మామిడితోటల్లో కాయలు కోసే పనిని ఎంచుకున్నారు. వేసవి సెలవులను వృథా చేయకుండా తమ చదువుకు కావాల్సిన డబ్బులను తామే సంపాదించుకుంటున్నారు. స్నేహితులంతా కలిసి ఆడుతూ, పాడుతూ పనులు చేస్తూ కాలక్షేపంతో పాటు డబ్బులు సంపాదిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. రోజుకు రూ.400 నుంచి రూ.600 వరకు సంపాదిస్తున్నారు. నీడపట్టున పనిచేసి తమ అవసరాలకు డబ్బులు సంపాదించుకోవాలని ఈ పనులు చేస్తున్నామని వారు పేర్కొంటున్నారు. తోటల్లో మామిడికాయలు కోస్తున్న కొంతమంది విద్యార్థులను 'సాక్షి' పలకరించింది.

'నవోదయ'లో సీట్ల భర్తీకి దరఖాస్తులు

కాగజ్‌నగర్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాగజ్‌నగర్ విద్యాలయం ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. పదోతరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూలై 22న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 9 విద్యాలయాల్లో ఎంపీసీ, బైపీసీ, కామర్స్ కోర్సుల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిభ, రిజర్వేషన్ ప్రాతిపదికన విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన వివరించారు.

ప్రశాంతంగా ఎంజేపీ బ్యాక్‌లాగ్ సెట్



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న శ్రీధర్

మంచిర్యాలటౌన్: జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి బుధవారం నిర్వహించిన బ్యాక్‌లాగ్ సెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 1,613 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,435 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంజేపీ జిల్లా కన్వీనర్ శ్రీధర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏడు పరీక్షా కేంద్రాలను జిల్లా అబ్జర్వర్ తిరుపతిరెడ్డితో కలిసి పరిశీలించారు.

కార్పొరేట్ కళాశాలలు దరఖాస్తు చేసుకోవాలి

మంచిర్యాలటౌన్: ఈ విద్యాసంవత్సరానికిగానూ రెప్యూటెడ్(కార్పొరేట్) జూనియర్ కళాశాలల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పి.రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులకు ప్రవేశం కల్పించేందుకు జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి రెప్యూటెడ్ జూనియర్ కళాశాలలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రెసిడెన్షియల్ వసతి, విద్యాబోధనలో ఉన్నత ప్రమాణాలు కలిగి, కాంపిటేటివ్ పరీక్షల్లో అధికసంఖ్యలో ఉత్తీర్ణత శాతం కలిగిన రెప్యూటెడ్ జూనియర్ కళాశాలలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గలవారు తమ కళాశాలల ఐదు సంవత్సరాలకు సంబంధించిన అకాడమిక్ ప్రొఫైల్‌తో పాటు ఈపాస్ వెబ్‌సైట్ https://telang anaepass.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో కళాశాలల ఈపాస్, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయి ఈ నెల 15వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కళాశాలలు బీ.ఐ.ఈ అనుబంధ ధృవీకరణ పత్రం, భవనం, వసతి గృహ వివరాలు, తరగతి గదులు, డార్మిటరీ, వసతి గృహాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వివరాలు, అకాడమిక్ రికార్డు, ఉత్తీర్ణత 90 శాతం, మొదటి శ్రేణిలో 50 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన కళాశాలల్లో చదువుతున్న ప్రతీ విద్యార్థికి ప్రభుత్వం ట్యూషన్ ఫీజు కింద రూ.35 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.3 వేలు ఏటా మంజూరు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి'

పాతమంచిర్యాల: ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కుంటాల కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీవోఏల ఉద్యమ కార్యాచరణ షెడ్యూల్ ప్రకటించారు. 11న ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేత, 12న ముఖ్యమంత్రి, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రులకు ఉత్తరాలు రాయడం, 14న వీవోఏల కుటుంబ సభ్యులచే నిరసన కార్యక్రమాలు, 15, 16 తేదీల్లో ఏపీఎం కార్యాలయాల ఎదుట సామూహిక దీక్షలు, 18న ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా, ర్యాలీ, 21న డివిజన్ కేంద్రాల్లో బతుకమ్మ ఆటలు, రాత్రి బస, 22న కలెక్టరేట్‌ను ముట్టడించాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం రాములు, గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్, వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి వెంకటేశ్, కోశాధికారి పొట్ట పోషం, ఉపాధ్యక్షులు రజిత, రమాదేవి, అనిత, సహాయ కార్యదర్శి పి.మహేష్, సలహాదారు జుమ్మిడి లక్ష్మణదాసు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వీవోఏలు

జన్నారంలో భారీ వర్షం



చెట్టును పక్కకు తీస్తున్న యువకులు

జన్నారం(ఖానాపూర్): జన్నారం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అరగంట పాటు బలమైన గాలులు వీయడతో జన్నారం నుంచి కలమడుగుకు వెళ్లే రోడ్డు పక్కనున్న పలు చెట్లు విరిగిపడ్డాయి. రోడ్డుపై వెళ్లే యువకులు చెట్లను రోడ్డు పై నుంచి తొలగించారు. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడ్డారు.

గొర్రెల యూనిట్లు సద్వినియోగం చేసుకోవాలి

నెన్నెల: గొర్రెల పెంపకందారులు రెండోవిడత గొర్రెల యూనిట్లు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వై.రమేశ్‌కుమార్ అన్నారు. బుధవారం చిత్తాపూర్ రైతు వేదికలో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు తమవాటా రూ.43,750 డీడీ తీయాలని సూచించారు. ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రాలు జత చేసిన దరఖాస్తులను పశువైద్యాధికారులకు అందించి ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. కలెక్టర్ ప్రతిపాదించిన జిల్లా అధికారితో లబ్ధిదారులు వెళ్లి గొర్రెలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. వాటాధనం నేరుగా లబ్ధిదారుల ఖాతా నుంచి కలెక్టర్ ఖాతాలో జమ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని పద్మ, సహాయ సంచాలకులు శంకర్, పశువైద్యాధికారి దిలీప్, గొల్లకుర్మలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారి

స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలి



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి కాలనీలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు అన్నా రు. బుధవారం సీతారాంపల్లిలోని ఫిల్టర్‌బెడ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిల్టర్ బెడ్ పని చేయక నాలుగు నెలలు కావస్తున్నా సింగరేణి యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఫిల్టర్‌కాని నీరు తాగి ఈ ప్రాంత ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అగల్‌డ్యూటీ రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఈర్ల సదానందం, నాయకులు మిట్టపల్లి మొగిలి, అడిచెర్ల రూపాదేవి, తిప్పని భీమయ్య, రావుల లక్ష్మణ్, కొంతం మహేందర్, తరాల విజయ్, నారగోని సతీశ్, రాజు పాల్గొన్నారు.

'బెల్లంపల్లికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు'

బెల్లంపల్లి: రాష్ట్రాన్ని పాలిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం బెల్లంపల్లి అభివృద్ధికి చేసిందేమీ లేదని బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మత్తమారి సూరిబాబు విమర్శించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి తప్పా కొత్తగా ఏమీ చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను తాము చేసినట్లు రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బెల్లంపల్లిలో మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. తాగునీటి ఎద్దడితో పురప్రజలు అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో రూ.18 కోట్లతో ప్రారంభించిన గోదారి నీటి పథకాన్ని దూరం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది కాదా అని ప్రశ్నించారు. 2017లో బెల్లంపల్లిలో నిర్మాణం తలపెట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్లు నేటికీ పూర్తి కాలేదని, ఇదేనా ప్రగతి అని ఎద్దేవా చేశారు. అధికార పార్టీ నాయకులు దర్జాగా భూ కబ్జాలకు పాల్పడుతూ ప్రభుత్వ భూములు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండి అఫ్జల్, గెల్లి జయరాం, మల్లారపు చిన్నరాజం, బైరి శ్రీనివాస్, మధునయ్య, ఓజియార్, శ్రీనివాస్, రాము పాల్గొన్నారు.

సింగరేణి స్థలాల క్రమబద్ధీకరణ గడువు పెంపు

- కలెక్టర్ బాదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: సింగరేణి స్థలాల క్రమబద్ధీకరణ గడువును జూన్ 30 వరకు పొడిగించినట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు వేణు, శ్యామలాదేవితో కలిసి బెల్లంపల్లి, మందమర్రి, నస్పూర్ మండలాల తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జీవో 76 కింద ఇప్పటి వరకు 10,890 దరఖాస్తులు రాగా 9,400 మంది ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుసుము చెల్లించారన్నారు. గడువు పొడగింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీవో 59 కింద అభ్యంతరం లేని ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు గడువును పొడిగించడం జరిగిందన్నారు.

టీకాల కార్యక్రమం పరిశీలన



పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ముల్కల్ల, నంనూర్, హాజీపూర్ గ్రామాల్లోని పల్లె దవాఖానాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ పనితీరును బుధవారం మంచిర్యాల డివిజన్ వైద్య, ఆరోగ్య శాఖా అధికారుల బృందం పరిశీలించింది. 12 వారాల లోపే గర్భిణుల రిజిస్ట్రేషన్ పూర్తిచేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సిబ్బందికి సూచించారు. క్షయ వ్యాధి నిర్ధారణకు ప్రతిఒక్కరూ నెలకు పది తెమడ నమూనాలను సేకరించి పరీక్షల కోసం పంపాలన్నారు. మలేరియా నిర్ధారణ కోసం జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ రఘుపతి, సూపర్‌వైజర్ జయమణి, ఏఎన్ఎంలు మాలతి, లక్ష్మి, సరస్వతి పాల్గొన్నారు.

గురుకులాల్లో ఉత్తమ ఫలితాలు

- సత్తా చాటిన జ్యోతిబాపూలే, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు



ఎస్.వైష్ణవి, 10 జీపీఏ



ఆర్.స్నేహరిక, 9.8

మంచిర్యాలటౌన్: జిల్లాలోని సోషల్ వెల్ఫేర్, మైనార్టీ, మహాత్మా జ్యోతిబాపూలే గురుకులాల్లోని విద్యార్థులు పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. బెల్లంపల్లి బాలికల, చెన్నూరు బాలుర మైనార్టీ గురుకులంలో వందశాతం, లక్సెట్టిపేట్‌లో వందశాతం ఉత్తీర్ణతతో పాటు ఒకరు 10 జీపీఏ సాధించారు. చెన్నూరు బాలుర గురుకులంలో వందశాతం ఉత్తీర్ణతతో పాటు ఇద్దరు 10 జీపీఏ సాధించారు. తాండూరు బాలుర గురుకులంలో 99 శాతం, గుడిపేట బాలుర గురుకులంలో 92 శాతం, బెల్లంపల్లి బాలికల గురుకులంలో వందశాతం, ఒకరు 10 జీపీఏ, మందమర్రి బాలికల గురుకులంలో 96 శాతం, ఒకరు 10 జీపీఏ, మంచిర్యాల బాలికల పాఠశాల 95 శాతం సాధించారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల్లో లక్సెట్టిపేట్ బాలికల, జైపూర్ బాలురు, బెల్లంపల్లి బాలికల, బెల్లంపల్లి సీవోఈ బాలుర, కోటపల్లి బాలుర గురుకులాలు 100 శాతం, చెన్నూరు బాలికలు 99 శాతం, కాసిపేట్ బాలురు 97 శాతం, మందమర్రి బాలికలు 97 శాతం, మంచిర్యాల బాలుర గురుకులం 90 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

ఎన్‌హెచ్ 63 బాధితుల దీక్ష కొనసాగింపు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల–ఆర్మూర్ నాలుగు వరుసల జాతీయ రహదారి 63 బాధితుల దీక్ష కొనసాగుతోంది. వేంపల్లి-ముల్కల్ల శివారులో దీక్షా శిబిరం ఏర్పాటు చేసి న్యాయం కోసం పోరు సాగిస్తున్నారు. రహదారి విస్తరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా, తమ అనుమతులు లేకుండా మా భూముల్లో సర్వే ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. పరిహారం విషయంలో కూడా స్పష్టత ఇచ్చాకే సర్వే చేయాలని డిమాండ్ చేస్తున్నారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ బుధవారం దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. రైతుబంధు సమితి మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ బొడ్డు శంకర్, నాతరి శ్రీనివాస్ ఎంపీ వెంకటేశ్‌నేతను కలిసి వినతిపత్రం అందజేశారు.



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సురేఖ



దండేపల్లి(మంచిర్యాల): ఎడారి ఓడగా పిలుచుకునే ఒంటెలు బుధవారం దండేపల్లిలోని రోడ్లపై కనిపించాయి. రాజస్థాన్‌కు చెందిన పలువురు గొర్రెల కాపర్లు గొర్రెలను మేపుకుంటూ వలస వచ్చారు. వారి సామగ్రిని ఒంటెలపై పెట్టుకుని వెళ్తుండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది.

మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ఆసిఫాబాద్: మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. మండలంలోని చిలాటిగూడకు చెందిన చౌదరి ఏమాజి (28) హమాలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిస కావడంతో ఇంట్లో తరచూ గొడవపడుతుండేవాడు. మంగళవారం సాయంత్రం మద్యం మత్తులో ఇంట్లోని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించగా పరిస్థితి విషమించడంతో రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శారద ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.